www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 19 నవంబర్ 2025

5

కాకినాడ



రాష్ట్రస్థాయి పోటీలకు సంపర విద్యార్థి

ప్రజాశక్తి - పెదపూడి

రాష్ట్రస్థాయి లాంగ్ జంప్ పోటీలకు మండలంలోని సంపర జడ్‌పి హైస్కూల్ విద్యార్థి సిరిశెట్టి సూర్యనారాయణ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఎంఎస్‌ఎన్.మూర్తి మంగళవారం తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్ -17 లాంగ్ జంప్ పోటీల్లో సూర్యనారాయణ ద్వితీయ స్థానం సాధించాడని తెలిపారు. ఈ సందర్భంగా విజేత సూర్యనారాయణను అద్దంకి ముక్తేశ్వరరావు, నాగిరెడ్డి వీరాస్వామి, టిడిపి మండల అధ్యక్షుడు తిబిరిశెట్టి గణేష్ అభినందించారు.



సూర్యనారాయణ

చలి పంజా..!

-పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

-అనారోగ్య సమస్యలతో జనం సతమతం

-దండిగా దండుతున్న ప్రయివేటు ఆసుపత్రులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గత వారం రోజుల నుంచి చలి పంజా విసురుతుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి. ఒక్కసారిగా వాతావరణం పూర్తిగా చల్లబడిపోవడంతో ప్రజలు చలికి గజ గజా వణికి పోతున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి మొదలుకొని ఉదయం 7 గంటల వరకు చలి తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది చలి ఎక్కువగా ఉంది. గత ఏడాది ఇదే సమయానికి అంతగా చలి కనిపించలేదని పలువురు చెబుతున్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు 30 నుంచి 32 డిగ్రీలు ఉంటుండగా కనిష్ట ఉష్ణోగ్రతలు 21 నుంచి 18 డిగ్రీలకు నమోదు అవుతున్నాయి. మంగళవారం 30 డిగ్రీలు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా 19 డిగ్రీలకు కనీసం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోవు రోజుల్లో ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ చెబుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చలి నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలంటూ వాతావరణ శాఖ సూచిస్తోంది.

దట్టంగా పొగ మంచు

చలి పులి నేపథ్యంలో అర్ధరాత్రి ఒంటిగంట దాటినప్పటి నుంచి తెల్లవారుజాము వరకు పొగ మంచు దట్టంగా అలుముకుంటుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పొగ మంచు ఎక్కువగా కనిపిస్తుంది. జాతీయ రహదారుల వెంబడి వెళ్లే వాహనాలకు పొగ మంచు ఆటంకం కల్పిస్తుంది. దీంతో వివిధ పనుల నిమిత్తం వెళ్లే గ్రామీణ రైతులు, వ్యవసాయ కార్మికులు, వ్యాపారాల కోసం వెళుతున్న చిరు వ్యాపారులకు పొగ మంచు ఇబ్బందులను కొని తెచ్చిపెడుతోంది. దీంతో ప్రయాణాలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్లపై ప్రయాణించే పెద్ద వాహనాలకు పది మీటర్లు మించి దారి కనపడని పరిస్థితి ఏర్పడింది. దీంతో పలువురు పొగ మంచు తగ్గేవరకు వాహనాలను రోడ్ల పక్కన పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెల్లవారుజామునే పొట్టకూటి కోసం పనులకు వెళ్లే భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు తదితరులు మంచు దెబ్బతో అవస్థలు పడుతున్నారు. జిల్లాలో పలుచోట్ల వరి పంట చివరి దశలో ఉంది. మరో 15 రోజుల్లో కోత దశకు వస్తుంది. ఈ నేపథ్యంలో మంచు దెబ్బ వలన తెగుళ్ల దాడి ఎక్కువగా ఉంటుందని పలువురు రైతులు వాపోతున్నారు. ఇంకోవైపు యంత్రాల ద్వారా కోతలు పలుచోట్ల జోరుగా సాగుతున్నాయి. అయితే తేమ శాతాన్ని తగ్గించేందుకు రైతులు రోడ్లకిరువైపులా ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. మంచు దెబ్బ వలన తేమశాతం తగ్గేందుకు అదనంగా ఒకటి నుంచి రెండు రోజులు సమయం పడుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పిఠాపురంలో రగ్గులు, స్వెటర్ల దుకాణం

రగ్గులు, స్వెటర్లతో రక్షణ

చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లోనూ రగ్గులు, స్వెటర్లకు గిరాకీ పెరిగింది. చలి నుంచి రక్షణ పొందేందుకు పలువురు వీటిని వినియోగిస్తున్నారు. ఉన్ని దుస్తులు కావడంతో వెచ్చదనం వస్తుందన్న కారణంతో వీటిని ఉపయోగిస్తున్నారు. దీంతో ఆయా వ్యాపారస్తులు అన్ని ప్రాంతాల్లోనూ తాత్కాలికంగా దుకాణాలను ఏర్పాటు చేసి అమ్మకాలు మొదలుపెట్టారు.

అనారోగ్యాలతో ఆసుపత్రులకు..

చలి తీవ్రత పెరగడంతో పలువురు అనారోగ్యాల గురవుతున్నారు. వైరల్ ఫీవర్లతో సతమతమవుతున్నారు. జలుబు, దగ్గు ఇతర ఇన్ఫెక్షన్లతో ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న పలు ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ప్రజల నుంచి భారీగా సొమ్ములు వసూలు చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రక్త పరీక్షలు, మందులు, ఒపి ఫీజుల పేరుతో పెద్ద మొత్తంలో గుంజుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి వ్యాధుల కాలంలో ప్రయివేటు ఆసుపత్రులపై నిఘా పెట్టి పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాలను పరిశీలించిన ఎంఎల్‌సి గోపిమూర్తి

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని పలు పాఠశాలలను పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి పరిశీలించారు. మంగళ వారం మండల పర్యటనకు వచ్చిన ఆయనకు యుటిఎఫ్ అధ్యక్షులు కొరుప్రోలు హరిబాబు, నాయకులు పైల రమేష్, బిర తాతబాబు, నాగరాజు తదితరులు ఘన స్వాగతం పలికారు. తొలుత స్థానిక మండల పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. హెచ్‌ఎం కోళ్ల రాంబాబుతో మాట్లాడారు. ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు తప్పడం లేదని హెచ్‌ఎం ఆయనకు వివరించారు. ఈ విషయాన్ని డిఇఒ దృష్టికి తీసుకెళ్లి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ సమస్యలను శాసనమండలి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆయన వెంట యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



ఎంఎల్‌సి గోపిమూర్తికి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

రైతులకు రుణాలు అందేలా చర్యలు

ప్రజాశక్తి - కోటనందూరు

తుని నియోజకవర్గంలోని కోటనందూరు, తుని, తుని రూరల్, తొండంగి మండల రైతులకు జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రూ.11 కోట్ల రుణాలను అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ యనమల దివ్య అన్నారు. మంగళవారం ఎస్.అన్నవరం పిఎసిఎస్‌లో రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోటనందూరు సొసైటీకి రూ.3 కోట్లు, ఎస్.అన్నవరం సొసైటీకి రూ.3.కోట్ల, ఎన్‌ఎన్.పట్నం సొసైటీకి రూ.5 కోట్లను ఆయా సొసైటీలో పరిధిలో ఉన్న రైతులకు రుణాలుగా ఇస్తామన్నారు. డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులు సొసైటీలో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించలేదని అన్నారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం సహకారంతో నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోటనందూరు, ఎస్.అన్నవరం, ఎన్‌ఎన్.పట్నం సొసైటీ ఛైర్మన్లు పెనుముచ్చి నాగేశ్వరరావు, పోలిశెట్టి రామలింగేశ్వర రావు, లాయర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సొసైటీ ఛైర్మన్‌లతో డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు

అన్న క్యాంటీన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని సంత చెరువు వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను నగర పాలక సంస్థ ఇన్‌ఛార్జ్ కమిషనర్ కెటి.సుధాకర్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. భోజనాలు చేస్తున్న వారిని కలుసుకుని మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? భోజనం శుచిగా, రుచిగా అందిస్తున్నారా? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు అతి తక్కువ ధరకే అన్న క్యాంటీన్‌ల ద్వారా ఆహారాన్ని అందిస్తోందన్నారు. అన్న క్యాంటీన్‌లలో ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నామని తెలిపారు.

పన్ను వసూళ్లపై అవగాహన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని వన్నెపూడి గ్రామంలో ఇంటి పన్ను వసూళ్లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సెలట్ రాజు పాల్గొని మాట్లాడారు. ఇంటి పన్ను వసూళ్లు సక్రమంగా జరిగితేనే పంచాయతీని అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. పన్నులు వసూలు అయ్యేలా రాజకీయ పార్టీల నాయకులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వి.సాగర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వరహాలు, సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక భవిత కేంద్రంలో వికలాంగ బాలలకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని బాలల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ విఆర్‌కె.చౌదరి అన్నారు. మంగళవారం ఆయన భవిత కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 3 నుంచి 18 సంవత్సరాల మధ్య వయసు గల శారీరక వైకల్యం కలిగిన బాలలకు ప్రతి మంగళవారం ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఫిజియో థెరపీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో ఫిజియోథెరపిస్టు డాక్టర్ అపర్ణ, పాఠశాల హెచ్‌ఎం కె.పద్మశ్రీ, భవిత సిబ్బంది బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, బాలల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యాన కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - యంత్రాంగం

యు.కొత్తపల్లి మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. మండలంలోని వాకతిప్ప గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపి మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు జ్యోతుల వాణి, నాయకులు అలపు సుధారాణి, లక్ష్మీకాంతం, బత్తిన రాణి, మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు రావు చిన్నారావు, జ్యోతుల బాబులు, గోపు హరిబాబు, తదితరులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** మండలంలోని తూర్పు లక్ష్మీపురం గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు పాల్గొన్నారు. వైద్య విద్య ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, ఎంపిటిసి సభ్యులు ఇజనగిరి ప్రసాద్, నాయకులు బ్రహ్మం, బుజ్జి, బాబి పాల్గొన్నారు. **సామర్లకోట** పట్టణంలోనిమెహర్ కాంప్లెక్స్ సెంటర్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు పాల్గొని మాట్లాడారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు వైసిపి పోరాటాన్ని సాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఊబా జాన్ మోజెస్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు మన్యం చంద్రరావు, నాయకులు ఇరుసుమళ్ల సాయి, కరణం భాను, మున్సిపల్ కౌన్సిలర్‌లు జట్ల మోహన్, కరణం రాజ్‌కుమార్, పాలికి కుసుమ చంటిబాబు, తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో మాట్లాడుతున్న దొరబాబు

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాశక్తి - కరప

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఎల్‌ఎ పంతం నానాజీ అన్నారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రూ.39.20 లక్షల విలువ చేసే 4 డ్రోన్లను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 18 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 19,599 మెట్రిక్ టన్నుల ధాన్యంను కొనుగోలు చేయాలని లక్ష్యంగా తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ రైతుల నుంచి 1965 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ధాన్యం సొమ్ములు రూ.4.54 కోట్లను 24 గంటల లోపు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. గత ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసినా సంబంధిత సొమ్మును రైతులకు సకాలంలో ఇచ్చే పరిస్థితి లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ధాన్యం అమ్మిన 24 గంటల్లోనూ రైతుల ఖాతాల్లో వారి కష్టార్జితాన్ని వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పంట కాలువకు తాగునీటి పైపులైన్ అడ్డుగా ఉందని రైతులు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన సంబంధిత పంట కాలువను పరిశీలించారు. అక్కడ నుంచే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడి నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జె.శ్రీనివాస్, డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఎడిఎ బాబురావు, యండమూరి సర్పంచ్ మారెళ్ల శివ, ఎఇ ఐ.సత్య, ఎఎంసి ఛైర్మన్ ముద్రగడ రమేష్, సొసైటీ ఛైర్మన్ ఎస్.భవానిశంకర్, జనసేన నాయకులు భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్ పాల్గొన్నారు.



రైతులకు డ్రోన్లను అందజేస్తున్న ఎంఎల్‌ఎ పంతం నానాజీ

సమస్యలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని రాఘవేంద్రపురం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని పటవల పంచాయతీ రాఘవేంద్రపురం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ జనరల్ బాడీ సమావేశం దోనం సునీత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద నుంచి వాటర్ ట్యాంకు స్థలం వరకు గల మురుగు కాలువను శుభ్రం చేయించాలన్నారు. మురుగునీరు, చెత్తాచెదారం ముళ్ళ కంపలతో ఉండడంతో ప్రజలకు రోగాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. దళితులు నివసిస్తున్న ప్రాంతంలో సిసి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేయాలని ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం గ్రామ కమిటీ నాయకులు తాడి నాగేశ్వరరావు, దోణం మాలయ్య, బీర బాలయోగి, తాడి రాజేష్, కుంచే సత్యవతి, కలవల మంగ, రాయుడు నాగమణి, బొడ్డు నాగమణి, మూర నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు ఆసుపత్రులు, ల్యాబుల్లో తనిఖీలు

ప్రజాశక్తి - కోటనందూరు

పట్టణంలోని పలు ప్రయివేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లపై వైద్య శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. శ్రీలక్ష్మి జనరల్ హాస్పిటల్, అంకారెడ్డి డెంటల్ హాస్పిటల్, దుర్గాప్రసాద్ డయాబెటికల్ మెడికల్ సెంటర్, రవితేజ లేబోరేటరీ, లీల నర్సింగ్ హోమ్, సురేష్ హాస్పటల్స్‌ను పరిశీలించారు. రిజిస్ట్రేషన్‌తో పాటు ఇతర పత్రాలను తనిఖీ చేశారు. ఆసుపత్రుల యాజమాన్యాలు రెన్యువల్ చేసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై డిఎంహెచ్‌ఒ నరసింహ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు ఆస్పత్రులకు నోటీసులు జారీ చేశారు. సకాలంలో రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేసుకోకపోతే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న జ్యోతి డయాగ్నోస్టిక్ సెంటర్‌ను అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి నరసింహ నాయక్ మాట్లాడుతూ అన్ని ఆసుపత్రులలో ధరల పట్టిక, సేవలు, డాక్టర్ల వివరాలను విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ

అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సత్తమ్మ కాలనీలోని సాగర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు వివిధ అంశాలపై సిఐ పి.విజయశంకర్ అవగాహన కల్పించారు. హెచ్‌ఎం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై సిఐ అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, అనారోగ్య సమస్యలు, రోడ్డు భద్రతకు పాటించవలసిన అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి సత్ప్రవర్తనతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ విజయశంకర్

ఒఎన్‌జిసి నష్ట పరిహారం విడుదల

ప్రజాశక్తి - తాళ్లరేవు

గతంలో కొందరు లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న ఒఎన్‌జిసి నష్ట పరిహారాన్ని ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఈ మేరకు పెద వలసల గ్రామానికి చెందిన 343 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.63,250 చొప్పున రూ.2,16,94,750లను ఆయా బ్యాంక్ ఖాతాలో జమ అయినట్లు ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో పలువురు టిడిపి నాయకులు, లబ్ధిదారులు మాట్లాడారు. పరిహారం విడుదల చేయించిన ఎంపి హరీష్ మాధుర్, ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ధూళిపూడి వెంకటరమణ, గ్రామ కమిటీ అధ్యక్షులు సంగాడి కామేశ్వరరావు, కామాడి మాతరాజు, లంకె నూకరాజు, మల్లాడి ధర్మారావు, ఈశ్వరరావు, గంగ సూర్యనారాయణ, వీరబాబు పాల్గొన్నారు.



ఎంపి, ఎంఎల్‌ఎలకు కృతజ్ఞత చెబుతున్న స్థానికులు

నిత్య అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - సామర్లకోట

భీమేశ్వర స్వామి నిత్య అన్నదాన పథకానికి మంగళవారం కాకినాడకు చెందిన కొరిపిళ్ళ కాశి విశ్వనాథం, ఉమా సుందరీ దేవి దంపతులు రూ.1,00,000 విరాళం అందజేశారు. ఈ విషయాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి బల్ల నీలకంఠం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం నంది మండపంలో దాతలకు తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని ఆలయ అధికారులు అందజేశారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం


ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీసు స్టేషన్ వద్ద మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ సహాయంతో జనసేన పార్టీ నాయకులు పేదలకు ఆహారాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదారపు వీరబాబు, కురుమళ్ళ నాగేశ్వరావు, సత్తి సోమరాజు, గంధం శ్రీను, పిఎస్‌పికె.స్వామి పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మతోన్మాద పాలన సాగుతుందని, అణిచివేత, అంటరానితనం, కులమత వివక్ష హింస పెట్రేగిపోతున్నాయన్నారు. రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్ల సత్యనారాయణ, పప్పు ఆదినారాయణ, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.భవాని, నాయకులు కెవి.రామయ్య, ఎన్.అనిల్‌కుమార్, బాలకృష్ణ, ఏసు పాదం, అర్జున్ రావు, తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్‌కు చెక్ పెట్టేలా చర్యలు

జిల్లాలోని పలు మండలాల్లో సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులకు మంగళవారం శిక్షణా కార్యక్రమాలు జరిగాయి. గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

సామర్లకోట స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, ఉప సర్పంచులకు క్లీన్ అండ్ గ్రీన్ థీమ్‌పై శిక్షణా కార్యక్రమం జరిగింది. సందర్భంగా ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా మాధవపట్నం, చంద్రంపాలెం పంచాయతీల కార్యదర్శులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.హిమామహేశ్వరి, డిప్యూటీ ఎంపిడిఒ మల్లాడి భైరవమూర్తి మాట్లాడారు. **గొల్లప్రోలు** మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఎంపిడిఒ నీతిపూడి సెలట్‌రాజు మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, నీటి వృధా, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అరిగేల అచ్చియమ్మ, ఇఒపిఆర్‌డి వి.సాగర్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఎంపిడిఒ లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. ఉప్పంగల, పోలేకురు పంచాయతీ కార్యదర్శులు పి.సునీల్, ఎం.విజయలక్ష్మి శిక్షణ ఇచ్చారు. కృష్ణా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్న డ్రై వేస్ట్ విధానం పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నార. **పెద్దాపురం** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణ మాటాడారు. పరిశుభ్రతకు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ జివి.శేఖర్‌రెడ్డి, వాలు తిమ్మాపురం కార్యదర్శి కె.వెంకటేష్ మాటాడారు. శిక్షణ పొందిన సర్పంచులు, ఉప సర్పంచులకు సర్టిఫికెట్లు అందచేశారు. **పెదపూడి** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శజక్షనా కార్యక్రమంలో ఎంపిడిఒ కొవ్వూరి నరేంద్రరెడ్డి పాల్గొన్నారు. జి.మామిడాడ కార్యదర్శి ఎస్.కనకనాగేంద్ర వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మేడపాటి సత్యనారాయణరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్, సచివాలయం కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.




సామర్లకోటలో శిక్షణకు హాజరైన ప్రజాప్రతినిధులు



గొల్లప్రోలులో సర్పంచులు, కార్యదర్శులు



తాళ్లరేవులో శిక్షణ ఇస్తున్న విజయలక్ష్మి



పెద్దాపురంలో సర్టిఫికెట్‌ను అందిస్తున్న ఎంపిడిఒ

నేరాలు ఘోరాలు

మున్సిపల్ చైర్‌పర్సన్ మొబైల్ హ్యాక్ రూ.3.40 లక్షల చోరీ

ప్రజాశక్తి - తుని

తుని మున్సిపల్ ఛైర్‌పర్సన్ నార్ల భవనసుందరి మొబైల్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి రూ.3.40 లక్షలను చోరీ చేశారు. ఈ మేరకు ఆమె మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన వాట్సాప్‌ని హ్యాక్ చేసి తన యుపిఐ పని చేయట్లేదని డబ్బులు అవసరమని తాను చాటింగ్ చేసినట్లుగా సైబర్ నేరగాళ్లు చాటింగ్ చేశారని అన్నారు. దీంతో తన బంధువులు, స్నేహితులు డబ్బులు వేయగా రెండు గంటల వ్యవధిలో రూ.3.40 లక్షలను స్వాహా చేశారని తెలిపారు.

ప్రాణం తీసిన కళాశాల బస్సు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మామిడాడ వద్ద బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ప్రయివేటు కళాశాల బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..పశ్చిమ గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన సాయి (27) మామిడాడ గ్రామ శివారున ఇటుక బట్టి నిర్వహిస్తున్నాడు. సరుకులు తెచ్చుకునేందుకు మంగళవారం ఉదయాన్నే బైక్‌పై బయలు దేరాడు. కొంచెం దూరం వెళ్ళేసరికి ప్రయివేటు కళాశాలకు చెదిన బస్సు అతివేగంతో ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతివేగం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెప్పారు. మృతునికి రెండేళ్ల క్రితం వివాహం కాగా, మూడు రోజుల క్రితం పాప జన్మించింది. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. హెచ్‌సి మాణిక్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గండేపల్లి మండలం జెడ్.రాగంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు.

మోసం కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - రౌతులపూడి

ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. రౌతులపూడికి చెందిన గెడ్డం లోవప్రసాద్ అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకొని అనంతరం పెళ్లికి నిరాకరించాడు. ఈ నెల 7వ తేదీన సంబంధిత యువతి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో లోవప్రసాదును అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక

ప్రజాశక్తి - సీతానగరం

అదృశ్యమైన వంగళపూడి గ్రామానికి చెందిన బాలికను పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. తన కుమార్తె అదృశ్యమైందని బాలిక తండ్రి యాళ్ల వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాలిక నాగంపల్లిలో ఉన్నట్టు గుర్తించారు. చదువులో వెనుకబడటంతో తల్లిదండ్రులు మందలించారని, దీంతో బాలిక చుట్టాల ఇంటికి వెళ్లినట్లు దర్యాప్తులో తేలిందని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు.

పోక్సో కేసులో నిందితునికి రిమాండ్

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురంలో ఇటీవల నమోదైన పోక్సో కేసులో నిందితుడు గడుసుల నాగవెంకటేష్‌ను నార్త్ జోన్ డిఎస్‌పి శ్రీకాంత్ అరెస్ట్ చేశారు. నిందితుడిని మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజులు రిమాండ్ విధించిందని సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు. బాలికలు, మహిళలతో గౌరవప్రదంగా వ్యవహరించాలని యువకులకు సూచించారు. లేకుంటే కేసుల్లో చిక్కుకుంటారని హెచ్చరించారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - కొత్తపేట

అమలాపురం వెళ్లే ప్రధాన పంట కాలువలో కొత్తపేట పరిధిలోని గోగివారిపేట సమీపంలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు. సుమారు 40- 45 సంవత్సరాలు వయసు కలిగిన పురుషుడి మృతదేహం కొట్టుకు వచ్చినట్లు చెప్పారు. అతని కుడి చేతిపై అనంత పవన్‌కుమార్ అని పచ్చబొట్టు ఉందన్నారు. చనిపోయిన వ్యక్తి శరీరంపై నీలం రంగుపై బిస్కెట్ కలర్ గళ్ల చొక్కా, బిస్కెట్ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. ప్రస్తుతం మృతదేహం కొత్తపేట ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉందన్నారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిసినవారు కొత్తపేట ఎస్ఐ సెల్ నెంబర్ 9440904842, రావులపాలెం రూరల్ సిఐ నెంబర్ 9440796527కు సమాచారం ఇవ్వాలని కోరారు.

గ్యాస్ డెలివరీ బాయ్‌కి తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట - పిఠాపురం రోడ్డులోని బ్రౌన్ పేట సెంటర్ వద్ద మంగళవారం రెండు లారీల మధ్య గ్యాస్ సిలిండర్లతో వెళుతున్న బైక్ చిక్కుకుంది. ఈ ప్రమాదంలో గ్యాస్ డెలివరీ బాయ్‌కి త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఎదురెదురుగా వస్తున్న లారీలు బైకును ఢీకొట్టడంతో గ్యాస్ సిలిండర్‌లు సరఫరా చేసే గంటా శివ పల్టీ కొట్టారు. ప్రమాదంలో బైక్ ధ్వంసం కాగా, శివ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో గ్యాస్ సిలిండర్లు కిందకు పడిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

ఘనంగా వన సమారాధన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ముప్పన వారి గాలి బంగ్లాలో మంగళవారం నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు కొమ్మన అమ్మన్నను పూల మాలలు, సాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బైలపూడి సూరిబాబు, తమ్మిరి శ్రీనివాస్, రాకుర్తి పుల్లయ్య, గుడివాడ సింహాచలం, గుడివాడ సత్యనారాయణ, బైలపూడి త్రిమూర్తులు పాల్గొన్నారు.

బిసి వసతిగృహంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - కరప

స్థానిక బిసి వసతి గృహంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదం జరిగింది. బిల్డింగ్‌లోని లిఫ్ట్ నిర్మాణానికి తీసిన ప్రదేశాన్ని స్టోర్‌గా వినియోగిస్తున్నారు. ఆ ప్రాంతం నుంచి సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటల చెలరేగడంతో మూడు ఫ్లోర్లోకి దట్టమైన పొగ మంటలు చెలరేగాయి. స్పందించిన సిబ్బంది విద్యార్థులను క్షేమంగా కిందికి దింపారు. పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. జరిగిన సంఘటనపై మంగళవారం జిల్లా బిసి కళాశాలల కన్వీనర్, ప్రిన్సిపల్ లోవరాజు పాఠశాలను సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులతో మాట్లాడి హాస్టల్‌లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సంజయ్ సంఘటనా ప్రాంతానికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు.



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న లోవరాజు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకొని వ్యాపారవేత్తలుగా ఎదగాలని జిల్లా పరిశ్రమల శాఖ జిఎం సిహెచ్.గణపతి అన్నారు. మంగళవారం స్థానిక టిటిడిసి శిక్షణా కేంద్రంలో బిడిఎస్ వర్క్‌షాప్ పేరుతో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపార వేత్తను తయారు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ వ్యాపార, సాంకేతిక, ఆర్థిక, బ్యాంకు రుణాలు, సబ్సిడీలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్, ఐఎల్ఒ మాస్టర్ ట్రైనర్ చరణ్‌సంజీవ్, ఎస్‌బిఐ రిటైర్డ్ చీఫ్ మేనేజర్ ఎ.బాలాజీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గణపతి

భవన నిర్మాణ కార్మికునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాత కోరంగికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కనకాల మణికంఠ కుటుంబానికి జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్ ఆర్థిక సాయాన్ని అందజేశారు. మంగళవారం ఆయన ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.5 వేల నగదు, బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి పోతుల రత్నకుమారి, వైసిపి నాయకులు చిట్టూరి చలపతి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యానాం వార్తలు



ఆందోళన నిర్వహిస్తున్న మత్స్యకారులు

భద్రత కోసం కొనసాగుతున్న ఆందోళన

ప్రజాశక్తి - యానాం

తమ ప్రజలకు భద్రత కల్పించాలంటూ చేపట్టిన ఆందోళన మంగళవారం నాటికి 36వ రోజుకు చేరింది. మంగళవారం దరియాలతిప్ప, సీతారామ నగర్, బాలయోగి నగర్, దొమ్మేటి పేట గ్రామాల ప్రజలు ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం ఎదుట రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ గత 36 రోజులుగా నిరసన దీక్షలు చేపట్టిన ఒఎన్‌జిసి అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నష్ట పరిహారం చెల్లించాలని ఆర్ఎఒ అంకిత్‌కుమార్, ఒఎన్‌జిసి అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన ఫలితం లేకుండా పోయిందన్నారు. ఒఎన్‌జిసి, రిలయన్స్ సంస్థల కార్యకలాపాల వల్ల సమీప ప్రాంతాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఆయా పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యానికి గుండె సంబంధిత, కిడ్నీ రోగాల భారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. 4 గ్రామాలను చమురు సంస్థలు దత్తత తీసుకోవాలని,హెల్త్ ఇన్స్యూరెన్స్ చేయించాలని, తమ ప్రాణాలకు భద్రత కల్పించాలని, పైప్ లైన్ లీకేజీలు అవ్వకూడా పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ఎఒ అంకిత్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎఒ మాట్లాడుతూ ప్రభుత్వం, చమురు సంస్థల అధికారులకు సమస్యను వివరిస్తానని హామీ ఇచ్చారు. తొలుత దరియాల తిప్ప నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా ఎస్పి వరదరాజన్ ఆధ్వర్యంలో ఎస్ఐలు పుణీత్‌రాజ్, కట్టా సుబ్బరాజు, శేరు నూకరాజు బందోబస్తు ఏర్పాటు చేశారు.

శిఖామణికి సప్పా ఎక్సలెన్స్ అవార్డ్

ప్రజాశక్తి - యానాం

రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ నాట్య గురువు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ జన్మదినం సందర్భంగా ప్రతీ ఏటా ఇచ్చే సప్పా ఎక్సలెన్స్ అవార్డుకు కళారత్న డాక్టర్ శిఖామణి ఎంపిక అయ్యారు. ఈ నెల 23 ఆదివారం రాజమహేంద్రవరంలో జరిగే అవార్డుల ప్రధానోత్సవ సభలో ఈ అవార్డును ఆయన అందుకోనున్నారు. అవార్డుకు ఎంపికైన శిఖామణిని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, దాట్ల దేవదానంరాజు, డాక్టర్ వరుగు భాస్కర్‌రెడ్డి, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, పొనుగుమట్ల విష్ణుమూర్తి, ముమ్మిడి చిన్నారి, సి హెచ్.రాం, రవి అభినందనలు తెలిపారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 21వ తేదీన జరిగే ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా యానాం మత్స్యశాఖ ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాలల విద్యార్థులకు వివిధ రకాల పోటీలను మంగళవారం నిర్వహించారు. స్థానిక స్విమ్మింగ్ పూల్‌లో ఈత పోటీలు, ఎస్‌టిపిపి జూనియర్ కళాశాల, శారదా విద్యానికేతన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణంలో విద్యార్థినులకు లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. వీరికి నగదు బహుమతని అందజేయనున్నారు. మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దడాల గొంతియ్య పర్యవేక్షణలో వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాల హెచ్‌ఎంలు పాల్గొన్నారు. విజేతలకు 21 వ తేదీన జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నామని మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తెలిపారు.

శివప్రసాద్‌కు మొదటి స్థానం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి వ్యాప్తంగా నిర్వహించిన అసిస్టెంట్ పోస్టుల డిపార్ట్‌మెంట్ టెస్టుల్లో యానాం రిజిస్ట్రేషన్ శాఖ యుడిసి అంగాడి శివప్రసాద్ ప్రథమ స్థానంలో నిలిచారు. అదేవిధంగా మాదా సుబ్రహ్మణ్యం, మోకా లీలావతి ఎంపికయ్యారు. ఎంపికైన వారు పరిపాలనాధికారి అంకిత్‌కుమార్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

బ్లాక్ లెవెల్ ఆటల పోటీలు

ప్రజాశక్తి - యానాం

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఎస్‌సిబి ఐటిఐ కళాశాలలో బ్లాక్ లెవెల్ ఆటల పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి తిర్రి గోపి మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, పరుగు పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణ సుధాకర్, జిల్లా యువజన అధికారి తిర్రి గోపి అందజేశారు.ఈ కార్యక్రమంలో వాసంశెట్టి ఆనంద్, నారాయణ, లంక ప్రసాద్, వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ రకాల పోటీలు

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని పలు గ్రంథాలయాల్లో మంగళవారం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత ఉపాధ్యాయులు బి.సూర్యనారాయణ, జెఎన్‌టియుకె అసిస్టెంట్ విజిటింగ్ ప్రొఫెసర్ కె.మెహర్‌గంగాధర్ వ్యవహరించారు. జూనియర్ విభాగంలో 6, 7 తరగతుల విద్యార్థులు 'స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు' అనే అంశంపైనా, సీనియర్స్ విభాగంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులు 'సోషల్ మీడియా ప్రయోజనాలు-అపాయాలు' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉప గ్రంథాలయాధికారి ఇన్‌ఛార్జ్ కె.కిషోర్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రావ్య, గ్రంథాలయ సిబ్బంది నాగేంద్ర కుమార్, ఫణీంద్ర కుమార్, వీర్రాజు, దుర్గాప్రసాద్, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్థానిక వివేకానంద పార్కులోని గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు వక్తృత్వం పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో స్వాతంత్ర ఉద్యమకారుల త్యాగాలు, సీనియర్స్ విభాగంలో సోషల్ మీడియా వలన ప్రయోజనాలు దుష్ఫలితాలు అనే అంశంపై నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్కార భారతి ప్రధాన కార్యదర్శి గునుపూడి సావిత్రిప్రసాద్, గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగు స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు పాల్గొని మాట్లాడారు. ప్రిన్సిపల్ మహమ్మద్ షాహిద్దీన్, వైస్ ప్రిన్సిపల్ జె.గణేష్, చీఫ్ లైబ్రేరియన్ డాక్టర్ ఎస్‌విఆర్.ప్రభాకర్ పోటీలను పర్యవేక్షించారు. **పెద్దాపురం** స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు మంగళవారం డ్రాయింగ్, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి నాగరాజు, జెఎన్ఎం హైస్కూల్ హెచ్‌ఎం తమ్మారెడ్డి రమేష్, మున్సిపల్ స్కూల్ హెచ్‌ఎం పెంకే పద్మశ్రీ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్.పావని, మూర్తి, బుల్లయ్య పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. స్థానిక గ్రంథాలయ అధికారి బందిల రత్నమణి పర్యవేక్షణలో జరిగిన జూనియర్ విభాగానికి 'అమ్మ ప్రేమ', సీనియర్ విభాగానికి 'పర్యావరణ పరిరక్షణ-ప్లాస్టిక్ నిషేధం' అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్. ఆగ్నేయ, టి.బాల మురళీకృష్ణ, టి.మణికంఠ, పాఠకులు పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక శాఖ గ్రంథాలయంలో దేశభక్తి గేయాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగాప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పిరామచంద్రరావు, ప్రముఖ సంగీత ఉపాధ్యాయుడు డాక్టర్ ఎస్.చక్రవర్తి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆర్.వెంకటరాము, విద్యార్థులు పాల్గొన్నారు.



కాకినాడలో వక్తృత్వ పోటీలను పర్యవేస్తున్న విశ్రాంత అధికారులు



కాకినాడ ఆదిత్యలో వక్తృత్వ పోటీలు



సామర్లకోటలో చిత్ర లేఖనం పోటీలు



పెద్దాపురంలో వ్యాసరచన పోటీలు



విజేతలకు బహుమతులు ఇస్తున్న ప్రసాద్

ఉత్సాహంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పోలేకుర్రు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక వైద్యులు, లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ విఆర్ఎన్‌బి.ప్రసాద్ సహకారంతో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు వివిధ వేషధారణలు, ఫ్యాషన్ షో, పండిట్ జవహర్లాల్ నెహ్రూ జీవితంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల తోపాటు, సర్టిఫికెట్స్‌ను డాక్టర్ ప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలేకుర్రు, తోటపేట పాఠశాలల కమిటీ ఛైర్మన్లు ఎంటి శ్రీనివాసరావు, దోణం వరలక్ష్మి, హెచ్‌ఎంలు పెంకె అమ్మాజీ, శీలం రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కలు, కోతులతో ప్రజల బెంబేలు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో పత్తి గ్రామంలో వీధి కుక్కలు, కోతులతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ద్విచక్రవాహనాలపై వెళ్లేవారితోపాటు, నడిచి వెళ్లే ప్రజలపైనా దాడికి పాల్పడుతున్నాయి. దీంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే భయపడుతున్నారు. కుక్కలు, కోతుల భారీ నుంచి కాపాడాలని పంచాయతీ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వీధిలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

దస్తావేజులు పోయినవి

నిడదవోలు మండలం, సమిశ్రగూడెం గ్రామ, డో.నెం.5-99, కాపురస్థులు, **మొహమ్మద్ అజ్మల్ తండ్రి: సిరాజుద్దీన్** అను నాయొక్క **ఒరిజినల్ దస్తావేజు నెం.1726/2006** గల డాక్యుమెంట్స్‌ను ది.14.11.2025 వ తేదీన బ్యాంకు పని నిమిత్తం డాక్యుమెంట్స్‌ను బండి కవర్‌లో పెట్టుకొని వెళుచుండగా డాక్యుమెంట్స్ కనిపించలేదు. కావున ఎవరికైనా దొరికినచో నాకు అందజేయగలరు. తగిన పారితోషకం ఇవ్వబడును.

మొహమ్మద్ అజ్మల్ తండ్రి: సిరాజుద్దీన్
ఫోన్: 9440125725

CHANGE OF NAME

I, **SYPUREDDY SUBBA RAO,** C/o Venkanna, H.No: 80-17-1, Koka bhaskaramma nagar, HDFC Bank opp line, AVA Road, Rajamahendravaram (Urban), East Godavari District, Andhra Pradesh - 533103. I have changed my name from SAYIPAREDDY SUBBA RAO (old name) to **SYPUREDDY SUBBA RAO** (new name), hence forth I am being called **SYPUREDDY SUBBA RAO**, C/o Venkanna, for all purposes.

CHANGE OF NAME

I, **SYPUREDDY PUNYAVATHI DEVI**, H.No. 80-17-1, Kokabhaskaramma nagar, OPP. HDFC Bank, AVA Road, Rajamahendravaram (Urban), East Godavari District, Andhra Pradesh - 533103. I have changed my name from SAYIPAREDDY PUNYAVATHI DEVI (old name) to **SYPUREDDY PUNYAVATHI DEVI** (new name), hence forth I am being called **SYPUREDDY PUNYAVATHI DEVI,** for all purposes.

IN THE COURT OF HON'BLE PRL.SENIOR CIVIL JUDGE, KAKINADA
A.S.NO.219/2024

Between:
Abbireddy Ramprakash ...**Appellant**
And
Chinchinada Sridevi ...**Respondent**

To. **RESPONDENT:**
Chinchinada Sridevi, W/o. Ravindranath, R/o.Flat No.E1, Swetha Soudha Apartments, Opp.RMC Men's Hostel, Madhav Nagar,Kakinada.

Please take notice that the above appeal filed by appellant against you stands posted to **11-12-2025** for your appearance in person or through your counsel at **10.30** a.m. before the above Hon'ble. Failing which the matter shall be decided by the Hon'ble Court in your absence as per law.

"By Order of the Hon'ble Court"
S.MURTUJA
ADVOCATE
KAKINADA
Cell.9652538888

పాస్ పోర్ట్ పోయినది

తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామల గ్రామానికి చెందిన కనికినీడి అమ్మన రాజ **పాస్‌పోర్ట్ నెం.K 3784689** తీసుకుని జిరాక్స్ నిమిత్తం తణుకు టౌన్ కు వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయినది దొరికినవారు క్రింది అడ్రస్ కు అందజేయగలరు

కనికినీడి అమ్మన రాజ
S/o కనికినీడి శ్రీనివాసు
డోర్ నెంబర్.3-25
ముక్కామల గ్రామం
పెరవలి మండలం
తూర్పుగోదావరి జిల్లా
ఫోన్ నెం-9121511503

మహారాజశ్రీ కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A.No.1120/2022 in O.S.No.221/2017

Between:-
Kesana Koteswara Rao @ Srirama Koteswara Rao & Others ...**Plaintiffs**
And
Kesana Srihari (Died) & Others ...**Respondents**

To.
R4. Bhogireddy V.V.S.Narayana S/o. Dharmaraju, Age 35years, R/o.D.No.4-71, Ithapudi, Kajuluru (M), Kakinada District.

పై నెంబర్ దావాలో I.A.No.1120/2022 నందు మీరు 4వ రెస్పాండెంటు అయివున్నారు. శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.01-12-2025సం॥** తేదికి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం **గం॥10.30 ని॥లకు** స్వయంగా గాని మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించ బడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
KAMUJU SRINIVASARAO
ADVOCATE,KAKINADA
Cell. 9908265647

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ రామచంద్రాపురం వారి కోర్టులో
IANo.994/2025, in I.A.No.886/2025 in O.S.No.396/2025

Between:-
Birudha Dorababu ...**Petitioner/Plaintiff**
And
Seelam Srinivasa Murthy ...**Respondent/Defendant**

పై నంబరు గల దావాలో వాది మీకు కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం IANo.994/2025 లో నోటీసులు కోర్టు నుండి మరియు Registered Post ద్వారా మీకు పంపడం జరిగినది. మీరు నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసులు జారీ చేయమని శ్రీ కోర్టువారు ఉత్తర్వులు ఇస్తూ **ది.21-11-2025సం॥** తేది. వాయిదా రోజు **ఉ॥10.30ని॥** లగాయతు మీరు గాని మీ తరపు న్యాయవాది గారి ద్వారా కానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయమలెను. లేని ఎడల సదరు మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం వాయిదా తేదీ 21-11-2025)

V.V.S.N.MURTHY
అడ్వకేట్, రామచంద్రాపురం
డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

ప్రకటన

నా క్లయింటు అయిన బిక్కవోలు మండలం బలభద్రపురం డోరు నెం 1-105రు కాపురస్తులు **కొవ్వూరి అప్పారెడ్డి గారి కుమారుడు కొవ్వూరి సంతోష్ మురళీ కుమార్ రెడ్డి** నాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియచేయినది ఏమునగా

నా క్లయింటు తాలూకు స్థిరాస్తి తాలూకు లింకు డాక్యుమెంటులు నెం. 1867 / 2020 మరియు 1013 / 2016ర్లు అనపర్తి సబ్‌రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిస్ట్రీ కాబడినవి. సదరు డాక్యుమెంట్స్ ది. 14-11-2025 తేదీన నాక్లయింటు బలభద్రపురం నుండి బిక్కవోలు వచ్చుచుండగా మార్గ మధ్యములో పడిపోయినవి.

కనుక సదరు లింక్ డాక్యుమెంట్లు ఎవ్వరికైనా లభ్యము అయినయెడల నా చిరునామాకు అందచేయగలరు. యింకను సదరు లింకు డాక్యుమెంట్లును పురస్కరించుకుని ఎవరైనా ఎట్టి అన్యక్రాంతములు చేసినను అట్టివి నా క్లయింటును ఎంతమాత్రం బైండు చేయజాలవు.

విషయం ఏమనగా ఈ విషయంపై బిక్కవోలు ఎస్.ఐ. గారికి రిపోర్టు ఇవ్వడం జరిగింది. నా క్లయింటు డాక్యుమెంట్లు వెరిటాస్ ఫైనాన్స్ లిమిటెడ్, గొల్లలమామిడాడ బ్రాంచ్ వారికి తాకట్టు పెట్టి లోను తీసుకొనుచున్నారు. సదరు లింక్ డాక్యుమెంట్లకు బదులుగా సర్టిఫైడ్ కాపీ బ్రాంచీ వారికి హామీగా అందజేయున్నారు.

ఆస్తి వివరం

తూర్పుగోదావరి జిల్లా అనపర్తి సబ్‌రిజిస్ట్రారులో చేరిన అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామం తాలూకు స.నెం.222/6రులో గల 10వ బ్లాకులో నివేశన స్థలం అందుల డోరునెం. 10-70రు రివిజను డోర్ నెం.10-71, అ.నెం. 1-302రుగల ఆర్.సి.సి. డాబా యింటికి హద్దులు. **తూర్పు :** అ.20లు రాజమార్గం, **పడమర:** అ.21లు తేతలి రామారెడ్డి వగైరాల స్థలం, **ఉత్తరం :** అ.71లు తేతలి వెంకటరెడ్డిగారి గోడ, **దక్షిణం :** అ.70లు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి వగైరాల స్థలం.
సదరు హద్దుల మధ్యస్తమయిన చ.గ.162లు స్థలం అందుల డాబా యిల్లు అందుల సర్వం సహా

S.THIRUMALARAO, B.A,B.L
VALLURU / VUNDURU
Samalkot Mandal. Cell: 8397431131

మహారాజశ్రీ 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

(మైనర్లు సింగుదాసు సాయిచరణ్, వయస్సు 18 సం॥లు, మరియు సింగుదాసు మధుప్రియ, వయస్సు 17 సం॥లు కొరకు)

G.W.O.P. No. 116/2025

Between:
సింగుదాసు నిర్మల, W/o. సింగుదాసు సురేష్ (లేటు), హిందు, వయస్సు 39 సం॥లు గృహిణి, డో.నెం. 8-1035, విక్టరీ రెస్టారెంటు వెనుక, రావులపాలెం, కోనసీమ జిల్లా. **-పిటీషనరు**
And
Nil **-రెస్పాండెంట్లు**

పై నంబరు గార్డియన్ గ్రంధంలో చనిపోయిన సింగుదాసు సురేష్ గారి పిల్లలు అయిన సింగుదాసు సాయిచరణ్, సింగుదాసు మధుప్రియ మైనర్లు అయినందున పిటీషనర్ సింగిదాసు నిర్మల గారిని గార్డియన్ నియమించమని మరియు మైనర్లు యొక్క అభివృద్ధి, చదువు, కొరకు ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని విక్రయించుటకు అనుమతులు కోరుచూ దాఖలు చేసిన G.W.O.P. లో ఎవరికైన ఎటువంటి అభ్యంతరములు ఉన్నయెడల **ది.08-12-2025 ఉదయం10.30ని॥లకు** పై కోర్టువారి ఎదుట హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలుపవలసిందిగా యావన్మందికి తెలియజేయడమైనది.

మైనర్లుయొక్క ఆస్తి వివరములు

East Godavari District, Rajamahendravaram District Registerar's Office, Rajamahendravaram Municipal Corporation, Rajamahendravaram Municipal Ward No.17, Mangalavarapupeta, T.S.No.233, Door No.34-2-17/1 newly constructed RCC (G+1) daba house (after removing the old tiled house) in an extent of 57.63 sq yards of site comprising of thee items mentioned below

1st Item:- Daba house bounded by:-

East:	Common Wall	...18'-3"
South:	2nd Item of this Schedule	...12'-3"
West:	Property of Vanga Suranna	...18'-3"
North:	Property of Manga Tatarao	...12'-3"

Within the above boundaries an extent of 24.76 sq.yards=20.47 sq.mtrs.

2nd Item:- Vakili (Fron Yard) site bounded by:-

East:	1st Item some extent and 3rd item some extent	...8'-9"
South:	2nd item of this schedule.	...25'-6"
West:	Property of Vanga suranna	...8'-9"
North:	Property of Managa Tatarao	...25'-6"

Within the above boundaries an extent of 24.69 sq.yards=21.0 sq mtrs.

3rd Item:- Common pathway site bounded by:-

East:	Road	...3'-6"
South:	Joint house wall of Vinukonda Nagababu	...21'-0"
West:	2nd Item of this schedule.	...3'-6"
North:	Common Wall	...21'-0"

Within the above boundaries an extent of 24.69 sq. yards = 21.0 sq.mtrs
In the above three items, 1st item site in full and in items 2 and 3 undivided joint 1/2 joint right and in total 57.63 sq. yards =48.07 sq mtrs of site and RCC(G+1) residential daba house with all usual eastment rights etc.

T.S.R. మూర్తి(అంజిబాబు)
అడ్వకేట్
ప్రకాష్‌నగర్, రాజమండ్రి
రాజమండ్రి
18-11-2025